సాక్షి అనంతపురం

శుక్రవారం : 14 : ఏప్రిల్ : 2023



బీటెక్ ఫలితాల విడుదల

జేఎన్‌టీయూ బీటెక్ రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్ సప్లి, ఎంటెక్ మూడో సెమిస్టర్ సప్లి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలు విడుదలయ్యాయి.



524 మంది గైర్హాజరు

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. గురువారం సైన్స్ పరీక్షకు 524 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.



జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఎండతీవ్రత పెరిగింది. గాలి వేగం తగ్గడంతో ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడ్డారు.



న్యూస్‌రీల్

సజావుగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ

అనంతపురం రూరల్: అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని తాడిపత్రి, శింగనమల, అనంతపురం, కూడేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. గురువారం అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైరింగ్, మోటర్ రివైండింగ్‌పై శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు హౌస్ వైరింగ్, మోటర్ రివైండింగ్‌లో 45 రోజుల శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. 5వ తరగతి నుంచి ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణ ఈ నెల 17 నుంచి ప్రారంభిస్తామని, వివరాలకు 90635 06775 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు



పరీక్షకు హాజరైన అంజలి

ఉరవకొండ: తమ్ముడు చనిపోయిన బాధను దిగమింగుకుని పరీక్షలకు హాజరైంది ఓ బాలిక. పట్టణానికి చెందిన రామాంజనేయులు, రాధమ్మ దంపతులకు పదో తరగతి చదువుతున్న అంజలితో పాటు 8వ తరగతి చదువుతున్న కుమారుడు సాయిరాహుల్ (13) ఉన్నాడు. ఈనెల 12న ఉరవకొండ గవిమఠంలోని దిగుడుబావిలోకి ఈతకు వెళ్లిన సాయిరాహుల్ ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో కుటుంబం మొత్తం విషాదంలో మునిగిపోయింది. ఈ క్రమంలోనే గురువారం పబ్లిక్ పరీక్ష ఉండడంతో ఉరవకొండ పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి సైన్స్ పరీక్ష రాయడానికి హాజరైంది అంజలి. కుమార్తెకు తండ్రి ధైర్యం చెబుతూ పరీక్ష గదిలోకి పంపే దృశ్యం అందరినీ కలిచివేసింది.

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది సందర్భంగా అందించే సేవా పతకాలకు జిల్లాకు చెందిన పలువురు పోలీసులు ఎంపికయ్యారు. కళ్యాణదుర్గం డీఎస్పీ బి. శ్రీనివాసులు మహోన్నత సేవా పతకానికి ఎంపికయ్యారు. ఉత్తమ సేవా పతకానికి స్పెషల్ బ్రాంచ్ ఏఎస్‌ఐ రమేష్, సేవా పతకానికి కళ్యాణదుర్గం సీఐ తేజోమూర్తి, అనంతపురం ఆర్‌ఎస్‌ఐ సీహెచ్ రాజశేఖర్ రెడ్డి, గుంతకల్లు రైల్వే ఎస్‌ఆర్పీ చౌడేశ్వరి, అనంతపురం మూడో పట్టణ హెడ్ కానిస్టేబుల్ సాలప్ప, అనంతపురం దిశా కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, పుట్లూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మయ్య, పామిడి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఉదా నాయక్, 14 బెటాలియన్ అనంతపురం ఏఆర్‌ఎస్‌ఐ ఎన్వీ రమణ, ఏపీఎస్పీ శ్రీనివాసులు, అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ఏఆర్ ఎస్‌ఐ పి.రాజు, గుంతకల్లు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఈ. నారాయణ రెడ్డి, జిల్లా ఫైర్‌మ్యాన్ ఎం. చాంద్‌బాషా, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, కానిస్టేబుల్ తాటిప్ప, ఎస్సై ఎన్. హనుమంతురాయులు ఎంపికయ్యారు.

నేడు అంబేడ్కర్ జయంతి

అనంతపురం రూరల్: అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్ రెడ్డి తెలిపారు. జెడ్పీ కార్యాలయం ముందు ఉన్న విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం అంబేడ్కర్ భవన్‌లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కలెక్టర్‌తో పాటు ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ఆధునిక అనంత

- శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లా కేంద్రం
- కలిసొస్తున్న వాతావరణం, భౌగోళిక పరిస్థితులు
- విద్య, వైద్య రంగాల్లో గణనీయమైన ప్రగతి
- 'మెట్రో' కల్చర్‌ను సంతరించుకుంటున్న నగరం



అనంతపురం వ్యూ



టవర్‌క్లాక్ : నగరానికి తలమానికం...

అనంతపురం డెస్క్:

అనంతపురం ..పదేళ్ల క్రితం వరకు సాధారణ అర్బన్ ప్రాంతం మాత్రమే. పేరుకు నగరం అయినప్పటికీ మిగిలిన పట్టణాల మాదిరే ఉండేది. నగరాల్లోని జీవనశైలి, వసతులు, సంస్థలు వంటివి పెద్దగా కన్పించేవి కాదు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. క్రమేణా మెట్రోపాలిటన్ నగర స్వరూపాన్ని సంతరించుకుంటోంది.

వాతావరణ, భౌగోళిక అనుకూలతలు

అనంతపురం నగర విస్తరణకు వాతావరణ, భౌగోళిక అనుకూలతలు దోహదపడుతున్నాయి. ఏ ప్రాంతం వారైనా సులువుగా ఇమిడిపోయేలా ఇక్కడి వాతావరణం ఉంటుంది. మరీ వేడిగానూ ఉండదు..అలాగని మరీ చల్లగానూ ఉండదు. ఇక భౌగోళిక పరంగా చూస్తే ఇటు బెంగళూరు, అటు కర్నూలు, హైదరాబాద్ నగరాలతో చక్కటి కనెక్టివిటీ కలిగి ఉంది. రవాణాకు అత్యంత ప్రధానమైన జాతీయ రహదారి –44 కూడా నగరం మీదుగానే వెళుతోంది. గతంలో ఇక్కడ తాగునీటి సమస్య అభివృద్ధికి అవరోధంగా ఉండేది. పీఏబీఆర్ పైపులైన్ తర్వాత ఆ సమస్య తొలగిపోయింది. పలు అనుకూలతలు ఉండడం వల్లే ఎక్కువమంది 'అనంత'లో స్థిరపడడానికి ఆసక్తి చూపుతున్నారు. కియా సిబ్బంది, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు నగరాన్ని కేంద్రబిందువుగా చేసుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఉపాధి కోసం ఇక్కడి నుంచి వలసలు వెళ్లేవారు. కానీ ఇప్పుడు ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి 'అనంత'కు వచ్చి ఉపాధి అవకాశాలను వెతుక్కుంటున్నారు.

నలుదిశలా విస్తరణ

అనంతపురం నగరం నలువైపులా విస్తరిస్తోంది. నగర పాలక సంస్థ వాస్తవ పరిధి 16.35 చదరపు కిలోమీటర్లు అయినప్పటికీ పలు రూరల్ ప్రాంతాలు కూడా నగరంలో అంతర్భాగంగా అభివృద్ధి చెందుతున్నాయి. తూర్పున బుక్కరాయసముద్రం, ఎస్కేయూ, పడమర కక్కలపల్లి, కురుగుంట, ఉత్తరాన పాముదాయి, దక్షిణాన రాప్తాడు వరకు నగరం విస్తరిస్తోంది. గతంలో నగరంలో చాలా తక్కువ సంఖ్యలో అపార్టుమెంట్లు ఉండేవి. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా అపార్టుమెంట్లు, విల్లాలు దర్శనమిస్తున్నాయి.

'అనంత' చెంతకు పెద్ద సంస్థలు

విద్య, వైద్య రంగాల్లోని పెద్దసంస్థలు సైతం 'అనంత' వైపు వస్తున్నాయి. ఇన్నాళ్లూ బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు పరిమితమైన కార్పొరేట్ వైద్యం ఇప్పుడు ఇక్కడే లభిస్తోంది. కేన్సర్, కిడ్నీ, గుండె, న్యూరో రోగాలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రముఖ కార్పొరేట్ విద్యాసంస్థలు సైతం నగరంలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేశాయి. దీనివల్ల చదువుల కోసం సుదూర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోతోంది. ఎంసెట్, ఐఐటీ మొదలు నీట్ శిక్షణ వరకు ఇక్కడే లభిస్తోంది. ఎస్కేయూ, జేఎన్‌టీయూ(ఏ), సెంట్రల్ యూనివర్సిటీతో పాటు ఫార్మసీ, అగ్రికల్చర్, ఇంజినీరింగ్ వంటి ప్రొఫెషనల్ కళాశాలలు ఏర్పాటవడంతో విదేశీ విద్యార్థులు సైతం వచ్చి చదువుకుంటున్నారు.

'మెట్రో' జీవనశైలి

నగరం విస్తరిస్తుండడం, విభిన్న వర్గాలు, ప్రాంతాల ప్రజలు స్థిరపడుతుండడం, ప్రపంచీకరణ ప్రభావం తదితర కారణాల వల్ల 'అనంత' వాసుల జీవనశైలిలోనూ మార్పు వస్తోంది. ముఖ్యంగా ఆహార సంస్కృతి (ఫుడ్ కల్చర్) విపరీతంగా వృద్ధి చెందుతోంది. రెస్టారెంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మల్టీప్లెక్స్‌లు, షాపింగ్ మాల్స్ కూడా బాగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్–బెంగళూరు హైవే రెస్టారెంట్ల హబ్‌గా మారిపోయింది. అరేబియన్, హైదరాబాదీ వంటకాలు మొదలుకుని కేఎఫ్‌సీ చికెన్ వరకు ప్రతి ఆహార పదార్థమూ లభిస్తోంది. స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ సంస్థలు కోరిన ఆహారాన్ని ఇంటి వద్దకే చేరుస్తున్నాయి. టెక్కీలకు వీకెండ్ సరదా కోసం సెమీ పబ్ కల్చర్ సైతం మొదలైంది. టీ కేఫ్ కల్చర్ ఇప్పటికే నగరమంతా విస్తరించింది. వేళకాని వేళ రవాణా కోసం ర్యాపిడో బైకులూ వచ్చేశాయి. హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో 'అనంత' కీలకంగా మారనుందని, ఫలితంగా రానున్న రోజుల్లో నగరం మరింతగా విస్తరిస్తుందనడంలో సందేహం లేదని నిపుణులు చెబుతున్నారు.

నగరంలో...

- జనాభా : 4 లక్షలు (అంచనా)
- ఆస్పత్రులు : 240
- విద్యాసంస్థలు : 170
- హోటళ్లు/రెస్టారెంట్లు : 200
- కార్పొరేషన్ పరిధి : 16.35 చ. కి.మీ

మెట్రో సిటీలకు దీటుగా వైద్యసేవలు



అనంతపురం నగరంలో మెట్రో సిటీలకు దీటుగా వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, యాంజియోగ్రామ్, బైపాస్ సర్జరీ వంటి సేవలు ఇక్కడే లభిస్తున్నాయి. విశేష ప్రావీణ్యం గల వైద్యనిపుణులు ఉన్నారు. క్యాన్సర్ చికిత్సకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. వైద్యసేవల పరంగా అనంతపురం శరవేగంగా అభివృద్ధి చెందుతుండడం సంతోషదాయకం. చదువుల పరంగానూ గతంతో పోలిస్తే నగరం చాలా వరకు అభివృద్ధి చెందింది.

– ప్రొఫెసర్ వై.వెంకట్రామిరెడ్డి, యూపీఎస్సీ మాజీ సభ్యులు

వీకెండ్ కల్చర్ పెరిగింది



మా అసోసియేషన్‌లో 70 రెస్టారెంట్లు నమోదయ్యాయి. మరో వందకు పైగా చిన్నాచితక హోటళ్లు ఉన్నాయి. నగరం విస్తరిస్తుండడంతో పాటు కోవిడ్ అనంతరం ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు వర్క్‌ఫ్రం హోం చేస్తుండడంతో రెస్టారెంట్లకు కొద్దివరకు ఆదరణ పెరిగింది. ముఖ్యంగా ఎక్కువమంది వీకెండ్‌లో రెస్టారెంట్లకు వస్తున్నారు. కానీ నగరంలో అవసరానికి మించి ఏర్పాటవుతున్నాయని అనిపిస్తోంది. దీనివల్ల నిర్వాహకులు నష్టపోవాల్సి ఉంటుంది.

– రమణ, రెస్టారెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు



నగర శివారులోని ఓ రెస్టారెంట్



ఐస్ హాకీ ఆడుతున్న నగరవాసులు

అంతా సెట్ చేస్తా

- బాధ్యతలు స్వీకరించిన డీఐజీ అమ్మిరెడ్డి
- గౌరవ వందనంలో సిబ్బందికి మందలింపు



సిబ్బంది బటన్ సరిచేస్తున్న డీఐజీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రేంజ్ డీఐజీగా ఆర్.ఎన్ అమ్మిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నేరుగా డీపీఓకు చేరుకున్న ఆయనకు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 9.30 గంటలకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అదనపు ఎస్పీలు హనుమంతురావు, నాగేంద్రుడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, సరోజ, హరి తదితరులు డీఐజీని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

చొక్కాకు బటన్ పెట్టి..
సున్నితంగా మందలించి..

బాధ్యతలు స్వీకరించేందుకు డీపీఓకు చేరుకున్న డీఐజీకి ఏఆర్ సిబ్బంది గౌరవ వందనం చేశారు. అయితే, సిబ్బందిలో ఇద్దరు చొక్కా కాలర్ గుండీ పెట్టుకోకపోవడాన్ని గమనించిన డీఐజీ.. వారిని సున్నితంగా మందలించారు. స్వయంగా బటన్లు పెట్టి పొరపాట్లను చక్కదిద్దారు. 'ఉద్యోగాలు మరిచిపోయినట్లున్నారు... త్వరలో అంతా సెట్ చేస్తా'నంటూ ముందుకు కదిలారు. బాధ్యతల స్వీకరణ అనంతరం డీఐజీ మీడియాతో మాట్లాడారు. అనంతపురం రేంజ్‌లో అధికారులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామన్నారు. కేసుల దర్యాప్తు వేగవంతం చేస్తామన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, పెయిడ్ లిక్కర్ రవాణా, విక్రయంలాంటి నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. దిశ యాప్ వినియోగంపై మరింత అవగాహన తీసుకొస్తామన్నారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని, ప్రజలనూ చైతన్యవంతుల్ని చేస్తామన్నారు.

అప్రమత్తంగా ఉండండి

నార్పల: సీఎం పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సీఎం సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో తెలుసుకున్నారు. కార్యక్రమం ముగిసే వరకు జాగ్రత్తగా ఉండాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఏఎస్పీలు హనుమంతు, నాగేంద్రుడు, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట

- ఒక్కో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామం ఒక్కో కానిస్టేబుల్‌కు దత్తత
- తరచూ సందర్శించేలా ఎస్‌ఐలకు బాధ్యత
- సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు
- మహిళలపై నేరాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించం
- నిందితులకు త్వరగా శిక్షలు పడేలా కృషి
- కొత్త డీఐజీ అమ్మిరెడ్డి



మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం రేంజ్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తామని కొత్త డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. గురువారం బాధ్యతలు చేపట్టిన అనంతరం 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలకు కారణమయ్యే వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామన్నారు. నేర ప్రవృత్తి ఉన్న వారిపై కన్నేసి ఉంచుతామని, సత్ప్రవర్తన వచ్చేవరకూ నిఘా కొనసాగిస్తామని చెప్పారు. మరికొద్ది నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. ఇంకా డీఐజీ ఏమన్నారో ఆయన మాటల్లోనే..

వేగంగా శిక్షలు పడేలా..

అనంతపురం రేంజ్ పరిధిలో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలున్నాయి. ఈ జిల్లాల పరిధిలో ముఖ్యంగా మహిళలు, చిన్నారుల రక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. మహిళలపై నేరాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించం. నిందితులపై కేసులు పెట్టి, వీలైనంత త్వరగా విచారణ చేసి శిక్ష పడేలా చూస్తాం. శిక్షలు వేగంగా పడటం వల్ల మిగతా వారిలో మార్పు వస్తుంది.

సైబర్ నేరాల నియంత్రణ..

ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోజూ వందలాది మంది బాధితులు నష్టపోతున్నారు. ఇలాంటి వాటిని అరికట్టేందుకు ప్రత్యేక మెకానిజం రూపొందిస్తాం. త్వరలో ఎస్పీలందరితో సమావేశం నిర్వహించి ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. పట్టణ ప్రాంతాల్లో చోరీలు, పెద్ద పెద్ద దొంగతనాల కట్టడికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తాం.

ఫ్యాక్షన్ గ్రామాల దత్తత

రేంజ్ పరిధిలో ఫ్యాక్షన్ ప్రభావం ఉన్న గ్రామాలున్నాయి. ఈ గ్రామాలను ఆ ప్రాంతాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కానిస్టేబుళ్లకు దత్తత ఇస్తాం. వారు తరచూ ఆయా కుటుంబాలతో మాట్లాడి అవగాహన కల్పిస్తారు. ఎస్‌ఐలు కూడా పర్యటిస్తుంటారు. దీంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుంది.

జాతీయ రహదారులపై గస్తీ


అనంతపురం రేంజ్ పరిధిలో పలు జాతీయ రహదారులు ఉన్నాయి. కొన్ని రహదారులు అంతరాష్ట్ర అనుసంధానం కలిగి ఉన్నాయి. అలాంటి వాటిలో హైదరాబాద్–బెంగుళూరు ఒకటి. అక్రమ మద్యం, హవాలా డబ్బు రవాణాకు దీన్ని ఉపయోగిస్తున్నట్టు తెలిసింది. దీనిపై ఆయా జిల్లాల సరిహద్దుల్లో మా సిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతాం.

వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు..

ఏడాదిలో రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కీలక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా ప్రతి నియోజకవర్గంలోనూ పోలీసులకు దిశానిర్దేశం చేస్తాం. రౌడీషీటర్ల కదలికపై పోలీసుల నిఘా ఉంటుంది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా లేని విషయాలను ప్రచారం చేసి వివాదాలకు కారణమయ్యే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు పడేలా చూస్తాం.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో ఎక్కడా చిన్న పొరపాటు కూడా చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ కె.శ్రీనివాసరావు, డీఆర్‌ఓ గాయత్రిదేవితో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17న శింగనమల నియోజకవర్గం నార్పలలో నిర్వహిస్తున్న 'జగనన్న వసతి దీవెన' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. సభాస్థలి, హెలిపాడ్ వద్ద సీటింగ్ సామర్థ్యాన్ని అనుసరించి వీఐపీలు, అధికారులు, వాహనాల పాసులు జారీ చేయాలని సూచించారు. వీఐపీలకు, ప్రజలకు పార్కింగ్ వేర్వేరుగా ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలం వద్ద వాహనాలు సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీరు, ఆహారం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

విద్యార్థులతో సీఎం ముఖాముఖి

సభాస్థలి సమీపంలో ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ కొందరు విద్యార్థులు ఉండేలా చూడాలని కలెక్టర్ చెప్పారు. వారితో సీఎం మాట్లాడే అవకాశం ఉందన్నారు. లబ్ధిదారులకు అందించే మెగా చెక్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులను, లబ్ధిదారులను వారికి ఏర్పాటు చేసిన బస్సుల్లో సమావేశానికి తీసుకురావడంతో పాటు తిరిగి క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆదేశించారు.

పటిష్ట బందోబస్తు..

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. నార్పల నాలుగు రోడ్ల కూడలి వద్ద ఒకవైపు వాహనాలు వెళ్లేలా, మరోవైపు వీఐపీ వాహనాలు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎక్కడా చిన్న పొరపాటు కూడా తలెత్తకుండా పక్కాగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉదయం 9.45కు పుట్టపర్తికి సీఎం

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం ఉదయం 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి సీఎం చేరుకుంటారు. 10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు 10.20కు చేరుకుంటారు. 10.30 గంటల వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. రోడ్డు మార్గంలో నార్పల క్రాస్ రోడ్ల వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభ స్థలి వద్దకు 10.40 గంటలకు చేరుకుంటారు. ఫొటో గ్యాలరీని 10.55 వరకు తిలకిస్తారు. 11 గంటలకు వేదికపైకి చేరుకుని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి జగనన్న వసతి దీవెన కార్యక్రమం ప్రారంభిస్తారు. లబ్ధిదారులతో మాట్లాడతారు. బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 'జగనన్న వసతి దీవెన' మెగా చెక్ విడుదల చేస్తారు. మధ్యాహ్నం 12.30కు కార్యక్రమం ముగుస్తుంది. మధ్యాహ్నం 12.35 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 12.45 గంటలకు హెలిపాడ్ వద్దకు చేరుకుని 1.05 గంటల వరకు స్థానిక నాయకులతో మాట్లాడతారు. 1.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి పుట్టపర్తి విమానాశ్రయానికి 1.30 గంటలకు చేరుకుంటారు. 1.40కు విమానంలో గన్నవరం వెళతారు.

కిలో టమాట రూ.10

అనంతపురం అగ్రికల్చర్: కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికినట్లు ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. కనిష్ఠం రూ.3, సరాసరిన రూ.5.50 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

ఇస్రో ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు అనుమతివ్వండి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జ్ఞాపికను అందజేస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ఎస్ఏ కోరి

అనంతపురం: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రాంతీయ పరిశోధన కేంద్రాన్ని అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో ఏర్పాటు చేసేందుకు అనుమతివ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆ వర్సిటీ వీసీ ఆచార్య ఎస్ఏ కోరి అభ్యర్థించారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలసి జ్ఞాపికను అందజేశారు. వర్సిటీ అభివృద్ధిపై చర్చించారు. ఇస్రోతో పాటు భారత రక్షణ రంగ సంస్థ (డీఆర్‌డీఓ)కు సంబంధించిన ప్రాంతీయ పరిశోధన కేంద్రాలు, స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విన్నవించడంతో రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారని గురువారం 'సాక్షి'కి వీసీ వివరించారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

- రైల్వే శాఖ సహాయ మంత్రి రావుసాహెబ్ పాటిల్ దన్వే



నియామక పత్రాలను అందజేస్తున్న మంత్రి రావుసాహెబ్ పాటిల్



పాల్గొన్న ఎమ్మెల్యే వైవీఆర్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

గుంతకల్లు: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా దేశ ప్రధాని మోదీ పనిచేస్తున్నారని రైల్వే శాఖ సహాయ మంత్రి రావుసాహెబ్ పాటిల్ దన్వే అన్నారు. గురువారం స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రైల్వే సహాయ మంత్రి పాటిల్ దన్వే, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, డీఆర్ఎం కే.వెంకటరమణారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరజమ్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని హాజరయ్యారు. మంత్రి దన్వే మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మనదేశంలో 65 శాతం మంది యువత ఉన్నారు. రోజ్‌గార్ మేళా కింద రైల్వే, పోస్టల్, ఐటీ, హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగాల కింద దేశ్యవాప్తంగా 71,000 ఉద్యోగాలు భర్తీ చేసినట్లు తెలిపారు. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీల్లో దాదాపు 10 లక్షల ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ముద్ర లోన్స్, మైక్రో ఫైనాన్స్, ప్రధానమంత్రి విశ్వ యోజన పథకం కింద యువతకు సహాయం అందిస్తూ ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తుదన్నారు. ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ రాయలసీమ దేశంలోనే వెనుకబడి ప్రాంతమన్నారు. రైల్వే ఉద్యోగాల్లో నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గుంతకల్లులో రైల్వే సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా రోజ్‌గార్ మేళాలో ఉద్యోగం పొందిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఈ-మెయిల్ ద్వారా వారికి నియామక పత్రాలను విడుదల చేశారు. అదే విధంగా గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా దాదాపు 1,100 మందిపైగా ఉద్యోగం పొందారు. వీరిలో 350 మంది నియామక పత్రాలను అందుకున్నారు. 25 మందికి మంత్రి పాటిల్ పత్రాలను అందజేశారు. అంతకు ముందు ప్రత్యేక రైల్లో సికింద్రాబాద్ నుంచి గుంతకల్లుకు చేరుకున్న మంత్రికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, స్థానిక నాయకులు శేకన్న, కొలిమి రామాంజినేయులు, మంజుల వెంకటేష్, మహేష్, విశ్వనాథ్, వనగొంది విజయలక్ష్మి తదితరులు ఘనస్వాగతం పలికారు. వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధాకర్, సూర్యనారయణ, సీనియర్ డీపీఓ చౌహాన్, సీనియర్ డీసీఎం ప్రశాంత్‌కుమార్, ఆర్‌పీఎఫ్ కమిషనర్ మురళీ కృష్ణ, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సన్నిధిలో రైల్వే మంత్రి

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో రైల్వే సహాయ మంత్రి రావుసాహెబ్ పాటిల్ దన్వే గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి దన్వే తోపాటు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, డీఆర్ఎం కే.వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో మేళతాళాల నడుమ స్వాగతం పలికారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి చిత్రపటం అందజేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇవేం ఎండలు బాబోయ్!



అనంతపురం అగ్రికల్చర్: ఎండలు దంచికొడుతున్నాయి. భానుడి విజృంభణతో జనం బెంబేలెత్తుతున్నారు. గురువారం శ్రీ సత్యసాయి జిల్లా చెన్నే కొత్తపల్లిలో 42.9 డిగ్రీలు, అనంతపురం జిల్లా గుంతకల్లులో 42.8 డిగ్రీలు మేర గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. గుత్తి 42.7 డిగ్రీలు, పుట్లూరు 42.3 డిగ్రీలు, గుమ్మగట్ట, యల్లనూరు 42.2 డిగ్రీలు, పామిడి, విడపనకల్లు 41.9 డిగ్రీలు, తాడిపత్రి, కూడేరు, యాడికి 41.8 డిగ్రీలు, శింగనమల, కళ్యాణదుర్గం 41.6 డిగ్రీలు, శెట్టూరు 41.5 డిగ్రీలు, పెద్దవడుగూరు, రాయదుర్గం 41.3 డిగ్రీలు, అనంతపురం 41.1 డిగ్రీలు నమోదు కాగా తాడిమర్రి 42.6 డిగ్రీలు, అగళి 42.4 డిగ్రీలు, ధర్మవరం 41.6 డిగ్రీలు, తనకల్లు, ముదిగుబ్బ, పరిగి 41.5 డిగ్రీలు, కొత్తచెరువు 41.5 డిగ్రీల మేర గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లో కూడా 38 నుంచి 41 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కొన్ని మండలాల్లో 19 నుంచి 21 డిగ్రీల మధ్య ఉండగా కొన్ని మండలాల్లో 24 డిగ్రీల వరకు రికార్డయ్యాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు వేడిగాలులతో సూరీడు సెగలు కక్కుతుండటంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ముగిసిన లోకేష్ పాదయాత్ర

తాడిపత్రి: యువగళం పేరుతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర గురువారం జిల్లా సరిహద్దు దాటి కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. మూడు రోజుల క్రితం తాడిపత్రి నియోజకవర్గం పెద్దపప్పూరు మండలం ప్రవేశించిన లోకేష్ పాదయాత్ర ఆది నుంచి పేలవంగానే సాగింది. పెద్దపప్పూరు, యాడికి మండలాల టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపకలేకపోయింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారానికి తాము చేపట్టే చర్యలపై స్పష్టమైన హామీలను ఇవ్వకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం వైఎస్ జగన్‌ను, స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని విమర్శించేందుకే ప్రాధాన్యతనిచ్చారు. గురువారం ఉదయం యాడికి మండలం రాయలచెరువు సమీపంలోని విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర.. దైవాలమడుగు మీదుగా నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆయనకు అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, టీడీపీ హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, జేసీ ప్రభాకరరెడ్డి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, నాయకులు పరిటాల శ్రీరాం, అస్మిత్ రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు.

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లల మృతి

అమరాపురం: మండలంలోని హలుకూరులో కుక్కల దాడిలో కాపరి క్రిష్టప్పకు చెందిన 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గురువారం ఉదయం గొర్రెలను మేపునకు పొలాల్లోకి తోలుకెళుతూ మూడు గొర్రెలు, 15 గొర్రె పిల్లలను దొడ్లో వదిలి వెళ్లాడు. మధ్యాహ్నం వాటికి నీటిని, మేతను కుటుంబసభ్యులు అందించారు. సాయంకాలం ఎవరూ లేని సమయంలో వీధి కుక్కలు దొడ్లోకి చొరబడి గొర్రె పిల్లలపై దాడి చేశాయి. ఘటనలో 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. రూ.60వేల వరకూ నష్టం వాటిల్లినట్లు ఈ సందర్భంగా కాపారి క్రిష్టప్ప కుటుంబసభ్యులు తెలిపారు.

487 మందికి పోస్టింగ్



కౌన్సెలింగ్ దృశ్యాలు

- ముగిసిన డీఎస్సీ-98 అభ్యర్థుల నియామక కౌన్సెలింగ్
- చివరి రోజు 256 మందికి గాను 22 మంది గైర్హాజరు

రాప్తాడురూరల్: అనంతపురం శారదానగర్‌లోని జిల్లా సైన్స్ సెంటర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థుల నియామక కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. జిల్లాలో మొత్తం 536 మంది అభ్యర్థులకు గాను తొలిరోజు 280 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 251 మంది హాజరయ్యారు. 29 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆధ్వర్యంలో రెండోరోజు కౌన్సెలింగ్‌కు 256 మంది అభ్యర్థులకు గాను 22 మంది గైర్హాజరయ్యారు. 234 మంది హాజరయ్యారు. తొలిరోజు గైర్హాజరైన వారిలో ఇద్దరు అభ్యర్థులు హాజరయ్యారు. వారికి చివరిలో స్థానాలు కేటాయించారు. రెండురోజుల్లో కలిపి మొత్తం 487 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 49 మంది గైర్హాజరయ్యారు.

అంతా ప్రశాంతం..

డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు సంబంధించి రెండు రోజుల పాటు జరిగిన నియామక కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగియడంతో విద్యాశాఖ ఊపిరి పీల్చుకుంది. ఏ చిన్న సమస్య తలెత్తకుండా డీఈఓ, సిబ్బంది పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. డీఈఓ మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులు క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించి విద్యాశాఖకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో అనంతపురం, గుత్తి డెప్యూటీ డీఈఓలు పద్మవాణి, శంకరప్రసాద్, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లు శ్రీనాథ్, ఆదినారాయణ, ఏఎస్ఓ ఓబుళరెడ్డి, ఏపీఓ నాగరాజు, సమగ్రశిక్ష ఏఎస్ఓ గురుమునికృష్ణ, ఏపీఓ నారాయణస్వామి, ఐటీసెల్ మారుతి పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారుల ఎంపిక అడ్డగింత



క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను అడ్డుకుంటున్న అసోసియేషన్ సభ్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక అనంత క్రీడా గ్రామంలోని హాకీ క్రీడా మైదానంలో గురువారం చేపట్టిన జిల్లా స్థాయి సీనియర్ పురుషుల హాకీ క్రీడాకారుల ఎంపికలను న్యూ అనంతపురం హాకీ అసోసియేషన్ సభ్యులు అడ్డుకున్నారు. ఎంపిక ప్రక్రియను చేపట్టిన అసోసియేషన్‌కు ఎలాంటి గుర్తింపు లేదని వాదించారు. గుర్తింపు ఉన్న న్యూ అనంతపురం హాకీ అసోసియేషన్‌తో చర్చించకుండా దొంగచాటుగా ఎంపికలు చేపట్టడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు. గుర్తింపు ఉన్న అసోసియేషన్‌కు ఎలాంటి సమాచారం లేకుండా ధర్మవరంలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలను సైతం అడ్డుకుంటామని న్యూ హాకీ అసోసియేషన్ సభ్యులు మారుతీప్రసాద్, జగన్ హెచ్చరించారు.

సంపులో పడి బాలుడి మృతి

రాప్తాడు: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం గాండ్లపర్తికి చెందిన బండి తిమ్మప్ప, శివమ్మ దంపతులకు ఓ కుమార్తెతో పాటు కుమారుడు యోగానంద (16) ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వారు. గతేడాది పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యోగానంద... ఉన్నత చదువులకు వెళ్లకుండా తండ్రికి చేదోడుగా ఉంటూ వ్యవసాయ పనుల్లో పాలు పంచుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం పశువుల దొడ్లో ఏర్పాటు చేసిన సంప్ వద్ద పని చేస్తూ అదుపు తప్పి అందులో పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి మృతి చెందాడు. చాలా సేపటి తర్వాత ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు కుమారుడి మృతదేహాన్ని వెలికి తీసి బోరున విలపించారు. ఘటనతో గాండ్లపర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'జగనన్నే మా భవిష్యత్తు'కు స్పందన భేష్

- ఆరు రోజుల్లో 40 లక్షల కుటుంబాల నుంచి మద్దతు
- స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ.250 కోట్ల స్కాం సూత్రధారి చంద్రబాబే
- ప్రభుత్వ సలహాదారు, జేసీఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న చల్లా మధుసూదన్‌రెడ్డి

అనంతపురం క్రైం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ఇందుకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి లభిస్తున్న స్పందనే నిదర్శనమని ప్రభుత్వ సలహాదారులు (స్కిల్ డెవలప్‌మెంట్), జేసీఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గడపగడపను సందర్శిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు అపూర్వ స్వాగతం లభిస్తోందన్నారు. కార్యక్రమం చేపట్టిన ఆరు రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల పరిధిలో 8 లక్షల మంది కార్యకర్తలు 50 లక్షల కుటుంబాలతో మమేకమై మాట్లాడారన్నారు. ఇందులో ప్రభుత్వ పాలనకు మద్దతుగా 40 లక్షల కుటుంబాలు 82960 82960కి కాల్ చేసినట్లు వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాల నేతలు, కార్యకర్తల ఇళ్లను సందర్శించి మద్దతును కోరినప్పుడు సానుకూల స్పందన లభించిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో అర్హులకు జరిగిన అన్యాయాన్ని, దౌర్జన్యాలపై ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.250 కోట్ల కుంభకోణానికి అప్పటి సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు, ఐటీ మంత్రిగా ఉన్న లోకేష్ పాల్పడ్డారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగానే ఎండీ, ఈడీ, ఓఎస్డీ, డిజైన్ టెక్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారని, న్యాయమూర్తి ఆదేశాలతోనే నిందితులను జైలుకు పంపారని గుర్తు చేశారు. సమావేశంలో జేసీఎస్ అనంతపురం కన్వీనర్లు చింతా సోమశేఖరరెడ్డి, ఆలమూరు శ్రీనివాస రెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, లక్ష్మణ్, చింతకుంట మధు, వైఎస్సార్ సీపీ అనంతపురం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జేసీఎస్ కన్వీనర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమ లక్ష్యాన్ని పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. గృహసారథులు, కన్వీనర్లు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల అరాచకాలు, ఆధిపత్యం చాటుకునేందుకు సాగించిన దౌర్జన్యాలపై ప్రతి కుటుంబాన్ని చైతన్య పరచాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధిపై అవగాహన కల్పించాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతుదారుల ఇళ్లనూ సందర్శించి వారి అభిప్రాయాలనూ సేకరించాలన్నారు. ఈ నెల 20లోపు నిర్దేశిత లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

బుడతడు.. మహా ఘనుడు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను చూపుతున్న అయాన్ ఆహిల్

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని పీటీసీలో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న బాబ్జాన్, ఆయేషా దంపతుల కుమారుడు అయాన్ ఆహిల్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. 22 నెలల వయసున్న ఈ చిన్నారి టాడలార్స్ ఎలక్ట్రిక్ కారును ఎవరి సాయం లేకుండా 1.3 కిలోమీటర్ల దూరాన్ని 18.15 నిమిషాల్లో పూర్తి చేసి, ప్రతిష్టాత్మకమైన అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. దీంతో పాటు వివిధ దేశాలకు చెందిన జెండాలను, స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలను, మానవ శరీర భాగాలను, రంగులను, 300 రకాల పక్షులను, జంతువులు, కూరగాయల పేర్లు చెప్పగలడు.

మృత్యువులోనూ వీడని బంధం



నాగేంద్ర మృతదేహం



రాణి మృతదేహం

గుత్తి రూరల్: మృత్యువు వారి బంధాన్ని విడదీయలేకపోయింది. పెళ్లి నాడు ఒకరికి ఒకరు తోడుగా ఉంటామని చేసి న బాసలు నిలబెట్టుకున్నారు. అయితే విధి ఆడి న వింత నాటకంలో ను వ్వులేక, నేనులేను అం టూ ఒకరి వెంట ఒకరు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. గుత్తి మండలం జక్కలచెరువు శివారులో 67వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ప్రమాదంలో దంపతులు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం దంచెర్ల గ్రామానికి చెందిన నాగేంద్ర (45), రాణి (35) దంపతులు పనిపై గురువారం ఉదయం ద్విచక్ర వాహనంలో తాడిపత్రికి వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. 6.30 గంటలకు గుత్తి మండలం జక్కలచెరువు వద్దకు చేరుకోగానే ఎదురుగా గుత్తి వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. దంపతులిద్దరూ ఒక్కసారిగా రోడ్డుపై పడ్డారు. అదే సమయంలో వెనుకనే వస్తున్న లారీ వారి మీదుగా దూసుకెళ్లింది. ఘటనతో నాగేంద్ర, రాణి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడు తన వాహనాన్ని నిలపకుండా ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతులకు 13 ఏళ్ల మణికుమారి, 11 ఏళ్ల దీనకుమారి, 10 ఏళ్ల వయసున్న సుగుణ అనే ముగ్గురు కుమార్తెలున్నారు. తల్లిదండ్రుల మృతదేహాలను చూసి కుమార్తెలు విలపించిన తీరు చూపరులను కలచివేసింది.

క్లుప్తంగా

శతాబ్ది ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్‌ను ఆహ్వానిస్తున్న ఉత్సవ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం శతాబ్ది ఉత్సవాలకు ఏపీ దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణను ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. గురువారం విజయవాడలో రామసుబ్రమణ్యం, మాజీ ఆలయ చైర్మన్ జయచంద్రనాయుడు, విశ్రాంత ఈవో నాగేంద్రరావు, విజయ్ కుమార్ తదితరులు వారిని కలిసి శతాబ్ది ఉత్సవాల ఆహ్వాన పత్రికలు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పీఠాధిపతులు పాల్గొని అనుగ్రహ భాషణం చేస్తారన్నారని తెలిపారు.

యూనిఫాం పంపిణీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సెక్యూరిటీలకు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ గురువారం యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావు, సెక్యూరిటీ రసూల్, జిలాన్ పాల్గొన్నారు.

ట్రోలింగ్ ఆపాలి

అనంతపురం టవర్‌క్లాక్: బండి శ్రీనివాసరావుపై సోషల్ మీడియాలో వస్తున్న ట్రోలింగ్ ఆపాలని ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి కోరారు. గురువారం స్థానిక ఎన్జీవో హోంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు మీడియా సమావేశంలో అన్న మాటలు వక్రీకరించి, పదే పదే సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం దారుణమన్నారు. ఏపీ ఎన్జీఓ నగరశాఖ సభ్యులు రామనాథ్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, రామాంజినేయులు, మహబూబు తదితరు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు అనివార్యం



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్ వెంకటరమణ

అనంతపురం: సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో నూతన ఆవిష్కరణలు అనివార్యమని డాక్టర్ ఎస్. వెంకట రమణ అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 'బేసిక్ కాన్సెప్ట్ ఆన్ ఎర్త్‌క్వేక్ రెసిస్టెంట్స్ డిజైన్ ఆఫ్ స్ట్రక్చర్స్' అనే అంశంపై గెస్ట్‌లెక్చర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగంలో తక్కువ ఖర్చుతో అత్యాధునిక నిర్మాణాలపై పరిశోధనలు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. సదస్సు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వైశాలి గోర్పడే, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. భవానీ పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన

అనంతపురం సప్తగిరి సర్కిల్: రక్తహీనత వల్ల కలిగే నష్టాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని సంబంధిత సిబ్బందిని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న మాతాశిశు మరణాలపై వైద్యాధికారులతో గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దినకర్, డాక్టర్ శంకర్ నారాయణ, సిబ్బంది సుబ్రహ్మణ్యం, లక్ష్మన్న పాల్గొన్నారు.

కోవిడ్ పరీక్షలు ప్రారంభం

అనంతపురం సప్తగిరి సర్కిల్: కోవిడ్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా మళ్లీ మొదలయ్యాయి. నగరంలోని సర్వజనాస్పత్రిలో ఈ నెల 9వ తేదీ నుంచి కోవిడ్ పరీక్షల ప్రక్రియను ప్రారంభించగా ఇప్పటి వరకూ 55 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో మూడు పాజిటివ్ కేసులు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా 45 పీహెచ్‌సీలు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లలో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు ప్రారంభమయ్యాయి. కాగా, కోవిడ్ అంశంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు అంటున్నారు.

'బట్టలూడదీసి కొడతాం'

- పట్టణ ప్రణాళిక అధికారులకు బీజేపీ నాయకుల దూషణ
- బీజేపీ తీరుపై నగరపాలక ఉద్యోగుల ఆందోళన



మేయర్ చాంబర్‌లో మునిసిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు



నగరపాలక సంస్థ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నగరపాలక సంస్థ ఆర్ఓ సతీష్, తదితర ఉద్యోగులు

అనంతపురం క్రైం: ప్లాస్టిక్ షాపుల నిర్వాహకుల జోలికొస్తే బట్టలూడదీసి తంతాం..కేసులు పెట్టుకోండి..ఉద్యోగాలేమైనా శాశ్వతమా? నగరపాలక సంస్థ అధికారులైతేనేం.. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎవడైతేనేం నగరపాలక సంస్థ అధికారులపై బీజేపీ నాయకులు దూషించారు. బీజేపీ నాయకుల తీరుపై నగరపాలక సంస్థ ఉద్యోగులు గురువారం ఆందోళన చేశారు.

అసలేం జరిగిందంటే..

నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్రావు, ఎస్ఐలు శ్రీనివాసులు, గౌస్ రాజు రోడ్డులోని మహాలక్ష్మి, మహావీర్ షాపుల్లో ఈ నెల 11న డెకాయి ఆపరేషన్ చేశారు. దాడుల్లో 10 టన్నుల నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేసి, రూ.లక్ష జరిమానా విధించారు. సీజ్ చేసిన ప్లాస్టిక్‌ను ఈ నెల 12న నగరపాలక సంస్థ అధికారులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు అప్పగించారు. వారు అల్ట్రాటెక్ కంపెనీలో నిషేధిత ప్లాస్టిక్‌ను దగ్ధం చేసేందుకు తరలించారు. దీనిపై బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, ఫయాజ్ అహ్మద్, ప్లాస్టిక్ షాపు నిర్వాహకులు నగరపాలక సంస్థ కమిషనర్‌ను కలిసేందుకు గురువారం వచ్చారు. ఆ సమయంలో కమిషనర్ లేకపోవడంతో మేయర్ వసీంను విన్నవించారు. మేయర్ నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులను తన చాంబర్‌కు పిలిపించారు. అక్కడ అధికారులను చూసి బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, ఫయాజ్ అహ్మద్, సీజ్ చేసిన షాపు యజమానులు రెచ్చిపోయారు. అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. అక్కడే ఉన్న మేయర్ అందరికీ సర్దిచెప్పారు.

నగరపాలక సంస్థ ఉద్యోగుల నిరసన..

బీజేపీ నాయకులు, ప్లాస్టిక్ షాపు యజమానులు వ్యవహరించిన తీరును తప్పుబడుతూ నగరపాలక సంస్థ అధికారులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలియజేశారు. ఆర్ఓ సతీష్, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, ఆర్ఐ మురళీ, సిబ్బంది శరత్, శ్రీకాంత్, ప్రవీణ్, సచివాలయ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు నగరపాలక సంస్థ ఆవరణలో బీజేపీ నాయకులు, ప్లాస్టిక్ షాపు నిర్వాహకుల తీరును తప్పుబడుతూ నినాదాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో చేపడుతున్న కార్యక్రమాన్ని అడ్డుతగిలే విధంగా వారు వ్యవహరించడం సరికాదన్నారు. దశలవారీగా నిరసనలు చేస్తామని హెచ్చరించారు. బీజేపీ నాయకులను అరెస్ట్ చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

'పురం'-కడప రైలు మార్గంపై దృష్టి పెట్టండి

- కేంద్ర రైల్వే సహాయ మంత్రిని కోరిన జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



కేంద్ర సహాయ మంత్రి రావుసాహెబ్ దాన్వేను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: హిందూపురం- కడప మధ్య రైల్వే మార్గం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కేంద్ర రైల్వే, బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి రావుసాహెబ్ దాన్వేను కోరారు. ఈ మేరకు గుంతకల్లు పర్యటనకు గురువారం వచ్చిన మంత్రిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో రైల్వేకు సంబంధించిన కీలక అంశాలపై విన్నవించారు. కడప–హిందూపురం (పాలసముద్రం, గోరంట్ల, ఓబుళదేవరచెరువు, కదిరి, రాయచోటి, రామాపురం మీదుగా ఒక మార్గం, గోరంట్ల, ఓబుళదేవరచెరువు, కదిరి, పులివెందుల, వేంపల్లె మీదుగా మరో మార్గం) రైలు మార్గం ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని నాలుగు దశాబ్దాల కిందట సర్వే చేశారని వినతిలో ఆమె పేర్కొన్నారు. అయితే ఆ ప్రయత్నాలు సర్వేకే పరిమితమయ్యాయన్నారు. పైన పేర్కొన్న రైల్వే మార్గం సాధ్యసాధ్యాలను పరిశీలించి, తదుపరి చర్యలు తీసుకోవాలని కోరారు. కరోనా మహమ్మారికి ముందు అనంతపురం రైల్వే స్టేషన్‌లో ఆగుతున్న మైసూర్ నుంచి హుబ్లీ మధ్య నడిచే హంపీ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ – న్యూఢిల్లీ మధ్య నడిచే రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను లాక్‌డౌన్ తరువాత ఆపలేదన్నారు. గుంటూరు–యశ్వంత్‌పూర్ మధ్య నడిచే ప్యాసింజర్ రైలును సైతం పునరుద్ధరించలేదని తెలిపారు. అనంతపురం రైల్వే స్టేషన్‌ను విస్తరించినా, కొన్ని పనులు పెండింగ్‌లో ఉంచారని ఆమె విన్నవించారు.

ఎస్పీని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్

జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాసరావును ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ గురువారం కలిశారు. ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఆమె..పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని తాజా పరిస్థితులపై కాసేపు మాట్లాడారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- ఎస్పీ కంచి శ్రీనివాసరావు



జిల్లా ఐటీ కోర్‌టీంకు సూచనలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని జిల్లా పోలీసు ఐటీ కోర్ టీం, సోషల్ మీడియా, టెక్నికల్ విభాగాల అధికారులకు ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచించారు. గురువారం విభాగాల వారీగా ఉద్యోగులతో ఆయన సమీక్షించారు. ఏ విభాగంలోనూ నిర్లక్ష్యం సహించబోనన్నారు. అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపునిస్తానన్నారు. అనంతరం ఎస్పీని ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన పలువురు అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుమరేశ్వరన్, సీఐలు అస్రార్‌బాషా, చిన్నగోవిందు, వెంకటేష్ నాయక్, నాగరాజు, విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు పరంధాముడు, భీమప్ప తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందు పుణ్యకార్యం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, నగర మేయర్ తదితరులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఇఫ్తార్ విందు పుణ్యకార్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని అరవింద్‌నగర్‌లోని మసీదు మామూర్‌లో ఆర్ఆర్ టైల్స్ యూనస్ పర్వేజ్, జావేద్ ఫిర్దోస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగర మేయర్ వసీం , రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముస్లింలకు రంజాన్ నెల శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక దువాను ఆచరించారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, మొహేబ్, శివారెడ్డి, బబ్లూ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అభినందనీయం

రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని రంజాన్ తోఫా పంపిణీ చేయడం అభినందనీయమని నగర మేయర్ వసీం తెలిపారు. స్థానిక నగరంలోని 11వ డివిజన్‌లో సామాజిక కార్యకర్తలు షేక్ నిజాం, జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పేద ముస్లింలకు సాయమందించాలనే ఉద్దేశంతో రంజాన్ తోఫాను అందించడం గొప్ప కార్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాబాఫకృద్దీన్, కమల్‌భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బయ్య, ఖాజా, ఖాజీ జాహీద్ హుస్సేన్, నిజాం, మసూద్, జాఫర్ పాల్గొన్నారు.

బంజారాల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ గౌతమికి సమస్యలు వివరిస్తున్న బంజారా సేవా సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమిని ఆలిండియా బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్ఎస్) అనంతపురం జిల్లా కమిటీ నాయకులు కోరారు. కలెక్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో కమిటీ అధ్యక్షుడు ఎస్.బాలాజీ నాయక్, గౌరవాధ్యక్షుడు అశ్వర్థనాయక్, తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి జిల్లాలో బంజారాలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తీసుకొచ్చారు. వాటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు శంకర్‌లాల్ నాయక్, ఎస్.కె. ధర్మసింగ్ నాయక్, నాయకులు డి.హర్షేనాయక్, రంగ్లానాయక్, పి.పరమేష్‌నాయక్, ఈశ్వరి బాయి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాంకేతిక సదస్సు జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న కళాశాల యాజమాన్యం

రాప్తాడు: సదస్సులతోనే విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన పెరుగుతుందని, ఈ నెల 15, 17 తేదీల్లో జాతీయ సాంకేతిక సదస్సును విద్యార్థులు జయప్రదం చేయాలని కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ, కళాశాల చైర్మన్ క్రిష్టారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి తెలిపారు. ఎనిగ్మా–2కే23ని జయప్రదం చేయాలని కళాశాలలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపాల్ సూర్యశేఖర్ రెడ్డి, ఈసీఈ విభాగపతి ఎస్‌వీ ప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హెటిరో డ్రగ్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

రాప్తాడురూరల్: నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు 18 మంది హెటిరో డ్రగ్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముందుగా రాత పరీక్ష నిర్వహించారు. అనంతరం కంపెనీ హెచ్ఆర్ సిమోన్ ఇంటర్వ్యూలు నిర్వహించి, 18 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. విద్యార్థులను గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సి.చక్రధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మధుసూదన్‌రెడ్డి, ఏఓ సాయినాథ్, అధ్యాపకులు అభినందించారు.

జగనన్న పాలనలో ప్రతి గడపకూ సంక్షేమం



49వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో కార్పొరేటర్ మునిశేఖర్, తదితరులు



'మా నమ్మకం నువ్వే జగన్' బ్రోచర్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



35వ డివిజన్‌లో బోచర్ అందిస్తున్న జేసీఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో ప్రతి గడపకూ సంక్షేమం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయతీలో 'జగనన్నే మా భవిష్యత్తు', 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ పరిధిలోని మల్లయ్యకాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా...లేదా అని అడిగారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నారెడ్డి, పెద్దన్న, సచివాలయం పార్టీ కన్వీనర్ వడ్డే కళమ్మ, వెంకటరామిరెడ్డి, హరీష్, బోయ ఆదెప్ప, గృహ సారథులు పాల్గొన్నారు.

జగనన్న పాలనతో స్వర్ణయుగం

రాప్తాడు: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందని బొమ్మేపర్తి సర్పంచు ఆనంద్ రెడ్డి, బొమ్మేపర్తి గ్రామ సచివాలయ కన్వీనర్లు నరసింహారెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, గోపాల్, లక్ష్మీ రెడ్డి, జోత్స్న అన్నారు. మండలంలోని బొమ్మేపర్తి పంచాయతీలో ఏడో రోజూ 'జగనన్న మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. మండలవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ వెళ్లి పలకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమణా రెడ్డి, రాజా బాబు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పథకాలు

ఆత్మకూరు: గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హతే ప్రమాణికంగా, పార్టీలకతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. గురువారం మండల వ్యాప్తంగా జగనన్న నువ్వే మా భవిష్యత్‌- జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం మండలంలోని తగరకుంట, పీకే, కేకే తాండాల్లో గ్రామాల్లో నువ్వే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి నిర్వహించారు. అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు, ఎంపీటీసీ క్రిష్టారెడ్డిలతో కలసి సచివాలయ కన్వీనర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాలు ఎలా అందుతున్నాయా?అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ప్రభంజన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవరెడ్డి, బీఎస్ నారాయణస్వామి, చంద్రశేఖర్, వలంటీర్లు, గృహ సారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో సోదాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం త్రీటౌన్ పోలీసులు స్టేషన్ పరిధిలోని రైల్వే, ఆర్టీసీ బస్టాండుల్లో గురువారం సోదాలు నిర్వహించారు. అనుమానితులను గుర్తించి స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించి వదిలివెళ్లారు. మద్యం మత్తులో ఆర్టీసీ బస్టాండులో సంచరించే వారిని మందలించి పంపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలిగించే వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కత్తి శ్రీనివాసులు సూచించారు. ఉచిత డయల్ 100 నంబరును బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

అనంతపురం: అంతర్జాతీయ దార్శనికుడు అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య అన్నారు. ఎస్కేయూ క్యాంపస్ బీఈడీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం ముందస్తుగా అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీధర్ రావు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సదాశివా రెడ్డి , డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ లోకేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాలను పరిశీలిస్తున్న డీపీఓ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలంలో ఇటుకలపల్లిలో వేరుశనగ పంటకోత ప్రయోగాలు గురువారం నిర్వహించారు. పర్యవేక్షణ అధికారి, డీపీఓ చంద్రనాయక్ ఆధ్వర్యంలో చేపట్టారు. 273–1ఏ సర్వే నంబరులోని ఈశ్వర్ రెడ్డి పొలంలో 5 గీ5 సైజులో పంట కోత ప్రయోగం చేశారు. వేరుశనగ కాయలను తూకం వేయగా 9.020 కిలోలు వచ్చింది. ఈ ప్రకారం ఎకరాకు 8.72 క్వింటాలు దిగుబడి వస్తుందని డీపీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి మురళి, ఏఎస్ఓ కళ్యాణి, వీహెచ్ఏ హేమ, ఎంపీఈఓ అపర్ణ, గ్రామ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు శివారెడ్డి, పెద్దిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పశుపథకాల అమలు భేష్

- వీసీలో డైరెక్టర్ అమరేంద్రకుమార్ ప్రశంస

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది మార్చితో ముగిసిన 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను పశుశాఖ పథకాల అమలులో అనంతపురం జిల్లా మూడో స్థానంలో నిలవడంపై ఆ శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరంలో మరింత సమర్థవంతంగా పనిచేసి మొదటి స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా నుంచి పశుశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ వెంకటేష్, జిల్లా స్థాయి వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ ఎన్.రామచంద్ర, డాక్టర్లు గోల్డ్‌మెన్, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దేవదానం సేవలు చిరస్మరణీయం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ఆధ్యాత్మికవేత్త, మానవతావాది శతాధిక వృద్ధుడు తొగురు దేవదానం గురువారం మృతిచెందారు. జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డివారి నెహమ్యా నాగరాజు, పాస్టర్ మనుష్యే తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన కుమారుడు రెవరెండ్ సంపత్‌కుమార్ పాస్టర్‌గా దైవపరిచర్యలో ఉన్నారు.

నేడు నవకోటి దత్తహోమం

అనంతపురం కల్చరల్: శృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలోని పాతూరు దత్తాత్రేయస్వామి దేవస్థానంలో ఈనెల 14 నుంచి 16 వరకు నవకోటి దత్తహోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి అప్పా సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లోకకల్యాణార్థం సాగే హోమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు శ్రీనివాసుడికి ఊంజల సేవ

అనంతపురం కల్చరల్: శ్రీవిష్ణు సహస్రనామ సేవా సత్సంగం వారి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఊంజల సేవ జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. శ్రీవారికి ఉదయం నుంచి రాత్రి వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాగుతాయన్నారు.

కర్జూర పండ్లు పంపిణీ

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లి, లాలాసాబ్ పల్లి, గొందిరెడ్డి పల్లి గ్రామాల్లోని మసీదుల్లో 100 మంది ముస్లింలకు కర్జూర పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ మాట్లాడుతూ రంజాన్ నెలంతా కర్జూర పండ్లు పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఫక్కీరప్ప, సూర్యనారాయణ, నరసింహారెడ్డి, సో మశేఖర్ రెడ్డి, నాగరాజు, కొండారెడ్డి, అశ్వర్థరెడ్డి, బాబయ్య పాల్గొన్నారు.

ప్రచారభేరి పోస్టర్ల విడుదల

రాప్తాడు: మండల కేంద్రంలో ప్రచారభేరి యాత్ర పోస్టర్లను గురువారం విడుదల చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పీట్ల రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.